అధ్వాన రోడ్లు.. జనం అవస్థలు



సుబ్బిరెడ్డిగారిపల్లె వద్ద సగం దెబ్బతిని ఓవైపు కుంగిపోయిన రోడ్డు



మామిళ్లవారిపల్లె వద్ద దెబ్బతిన్న తారురోడ్డు

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- దెబ్బతిని ప్రమాదాలకు నిలయాలుగా తారు రోడ్లు
- నరకం చూస్తున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

గుర్రంకొండ: 'వామ్మో.. ఆ రహదారుల్లో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లినా ఒళ్లు గుల్ల కావడం ఖాయం' అంటూ ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యక్ష నరకాన్ని తలపిస్తున్న ఈ రోడ్లపై ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని తారు రోడ్లు అధ్వాన్నంగా మారాయి. పలుచోట్ల దెబ్బతిన్న రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

దెబ్బతిన్న రోడ్లుతో ఇబ్బందులు

- గుర్రంకొండ– గాలివీడు మార్గంలోని మామిళ్లవారిపల్లె వద్ద పలుచోట్ల తారు రోడ్డు దెబ్బతింది. చిన్నపాటి వర్షాలకే పలుచోట్ల రోడ్డు కోసుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.
- తరిగొండ– రేగడపల్లె వరకు ఉన్న తారురోడ్డు దెబ్బతిని పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి.
- సరిమడుగు– తరిగొండ వరకు ఉన్న తారు రోడ్డు పలు చోట్ల తారు కొట్టుకుపోయిన కంకర తేలిపోయింది. గోతులు ఎక్కువగా ఉండడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.
- సుబ్బిరెడ్డిగారిపల్లె– కృష్ణాపురం వరకు ఉన్న తారు రోడ్డు దెబ్బతింది. సగం రోడ్డు మొత్తం కోసుకు పోయి పూర్తిగా ఓవైపుకు ఒరిగిపోయింది. రోడ్డు పక్కనే దిగుడుబావి కూడా ఉంది. రాత్రిళ్లు ఇక్కడ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికే పలువాహనాలు బోల్తాపడి పలువురు గాయపడ్డారు.
- ఎల్లుట్ల నుంచి నగరి వరకు ఉన్న తారు రోడ్డు చాలా వరకు దెబ్బతింది. చెరువు కట్టపై గతంలో తారు రోడ్డు వేశారు. పలుచోట్ల రోడ్డు నిట్టనిలువునా చీలిపోయింది. దీంతో వాహనాలు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు.
- శ్రీనివాసపురం– ఎగువబురుజుపల్లె, మర్రిపాడు– తరిగొండ వరకు ఉన్న గ్రామీణ తారు రోడ్లు అధ్వాన్నస్థితికి చేరుకొన్నాయి. పలు చోట్ల గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.
- కేశాపురం– టి.పసలవాండ్ల వరకు ఉన్న తారు రోడ్డు అధ్వాన్నంగా మారింది. సగం రోడ్డులో పెద్ద గొయ్యి ఏర్పడింది, దగ్గరకి వచ్చి చూసేంతవరకు ఇక్క గొయ్యి ఉందని విషయం అర్థం కాదు. దీంతో వాహనాలు ప్రమాదాలకు గురువుతున్నాయి.

సగం రోడ్డు కుంగిపోయింది



సుబ్బిరెడ్డిగారిపల్లె వద్ద సగం రోడ్డు కుంగిపోయింది. మొత్తం నెర్రెలుచీలిపోయి ఓవైపుకు ఒరిగిపోయింది. వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. ప్రతిరోజు ఇక్కడ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. కొద్దిరోజులు గడిస్తే ఉన్న కాస్తా రోడ్డు కూడా పూర్తిగా ఒరిగిపోయే ప్రమాదముంది.

– ఆనందరెడ్డి, కొత్తపల్లె

మరమ్మతులు చేపట్టాలి



కేశాపురం నుంచి టి.పసలవాండ్లపల్లె వరకు ఉన్న తారు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఓ చోట రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇంతవరకు తాత్కాలికంగా మరమ్మతులు కూడా చేపట్టలేదు. ముఖ్యంగా ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– రమేష్‌బాబు, మొరంపల్లె

'వింత వివాహం' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరణ చేస్తున్న రచయితలు

మదనపల్లె సిటీ: స్థానిక చిప్పిలిలోని మునిగోటి నిలయంలో గురువారం ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఏ. కృష్ణమూర్తి రచించిన హాస్య నవల 'వింత వివాహం' గ్రంథావిష్కణ జరిగింది. ప్రఖ్యాత పద్యకవి డాక్టర్ మునిగోటిసుందరరామశర్మ గ్రంథ సమీక్ష చేశారు. కృష్ణమూర్తి రచనలు సామాన్యులను అర్థమయ్యే విధంగా సమాజానికి దగ్గరగా ఉండే విధంగా రచనలు చేస్తారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు, ప్రఖ్యాత రచయిత వేంపల్లి సికిందర్, వి.ఎం.నాగరాజు, వాసా కృష్ణమూర్తి, ప్రభాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు నడపాలని విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: స్టూడెంట్స్ కోసం స్పెషల్ బస్సులు నడపాలని కోరుతూ మదనపల్లె మండలం కట్టుబావి వద్ద గురువారం విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఆర్టీసీ బస్సులు బడి సమయానికి రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థులు ఆర్టీసీ బస్సును నిలిపివేసి రోడ్డుపై బైఠాయించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎంకు ఫోన్ ద్వారా తెలియజేశారు. విద్యార్థులకు సమయానికి బస్సులు నడుపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మదనపల్లె : వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక వాల్మీకి సంఘం కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జయంతిని నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని రామాలయాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. రామాయణాన్ని లిఖించి, రాముడి గొప్పతనాన్ని నేటికీ సజీవంగా ఉంచిన పురుషోత్తముడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఆయన సూచించిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకిసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సద్దల జయసింహ, మంజునాథ్, బొంత రామకృష్ణ, నరసింహులు, కృష్ణమూర్తి, గౌరమ్మ, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

● వినూత్న ఆలోచన.. పంటకు రక్షణ



పొలాల్లో అడవి జంతువుల బారినుంచి పంటను కాపాడుకోవడానికి రైతులు ఏర్పాటు చేసుకొన్న పరికరం

భూమిలో విత్తనాలను వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చేదాకా రైతులకు ప్రతిరోజు పోరాటమే. చేతికొచ్చిన పంటలను రక్షించుకునేందుకు అన్నదాతలు నానా కష్టాలు పడుతుంటారు. పంటను కాపాడుకునేందుకు వినూత్నంగా ఆలోచిస్తూ పంట చేనుల్లో వివిధ పరికరాలను ఏర్పాటు చేసుకుంటూ, పక్షులు, జంతువులు అటువైపు రాకుండా జాగ్రత్త పడుతుంటారు కర్షకులు. అంతంత మాత్రంగా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ పంట చేతికందక అల్లాడుతున్న రైతులకు గోరుచుట్టుపై రోకలిపోటు అన్నట్లుగా అడవి పందులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువులు పంటపొలాలపై రాత్రిళ్లు గుంపులు గుంపులుగా దాడులు చేసి నాశనం చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో రైతులు పొలాల్లో అక్కడక్కడ కట్టెలను నాటి వాటికి పాలిథిన్ షీట్లు దారాలు కడుతున్నారు. ఖాళీగాజు సీసాలను కూడా వాటికి జతచేసి ఒక వరుస క్రమంలో అమర్చుతున్నారు. పగలు, రాత్రిళ్లు అని తేడా లేకుండా గాలివీచినప్పుడల్లా చప్పుళ్లు చేస్తుండడంతో మనుషుల సంచరిస్తున్నారేమోనని జంతువులు భావించి పంట పొలాల వైపు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

– గుర్రంకొండ

నేడు డయల్ యువర్ డీఎం

పీలేరురూరల్ : పీలేరు ఆర్టీసీ డిపో పరిధిలో సమస్యల పరిష్కారానికి శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం బి. కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డీఎం కార్యాలయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఆర్టీసీ ఆదాయం పెంచడానికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ఆసక్తిగల వారు 9959225679 నంబరులో సంప్రదించాలని కోరారు.

పంచాయతీ కమిషనర్ బదిలీ

బి.కొత్తకోట: నగర పంచాయతీ కమిషనర్ పీఆర్. మనోహర్ బదిలీ అయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన గత ఏడాది ఎఫ్ఏసీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను చేపట్టారు. ఇక్కడి నుంచి అయనను మదనపల్లె సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ మేనేజర్‌గా బదిలీ చేశారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, కిరణ్ కుమార్ కూడా బదిలీ అయ్యారు. శ్రీనివాసులు మదనపల్లె మున్సిపాలిటికి, కిరణ్‌కుమార్ పలమనేరు మున్సిపాలిటికి బదిలీ చేశారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. మన దేశం వ్యవసాయ దేశమని, ఇంధనం, రవాణా గురించి, స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు షఫీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

బి.కొత్తకోట: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని సీఐ రాజారెడ్డి తెలిపారు. బాలసానిపల్లెకు చెందిన బాబు (49) కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో గురువారం దాడులు నిర్వహించామని, నిందితుడి వద్ద నుంచి 49 మద్యం ప్యాకెట్ల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచామని పేర్కొన్నారు.

న్యాయం చేయాలంటూ బాధితుల రిలే దీక్షలు

రాయచోటి అర్బన్ : దళితుల భూమిని ఆక్రమించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. తమ భూమిని ఆక్రమించిన రహంతుల్లా అతని కుటుంబసభ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి తమ భూమిని తమకు తిరిగి ఇప్పించాలని గుర్రంకొండకు చెందిన బుడ్డపల్లె కదిరప్ప కుటుంబీకులు గురువారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ విషయమై గతంలో అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో రిలే నిరాహార దీక్షలకు చేస్తున్నట్లు బాధిత కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

అప్రకటిత కరెంట్ కోతలతో ఇక్కట్లు

గాలివీడు : పట్టణంలో అప్రకటిత కరెంట్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియక ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. ఒక పక్క ఎండలు మండిపోతుండగా అనధికారికంగా కరెంట్ సరఫరాను గంటల తరబడి తీసేస్తుండటంతో ఫ్యాన్లు తిరగక, గాలి రాక వృద్ధులు, చిన్నారులు నరకం చూస్తున్నారు. ఇన్వర్టర్లు(బ్యాటరీ) లేని వ్యాపార దుకాణాలు, ఇళ్లలో ఉండే వారు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై విద్యుత్ సిబ్బందిని ఆరాతీస్తే కోతలు లేవని గోపనపల్లె, గోరాన్‌చెరువు సబ్ స్టేషన్లలో లోడ్ ఎక్కువై సిటీలు దెబ్బతినడం వలన గత రెండు రోజులుగా అంతరాయం కలిగిందని పేర్కొంటున్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



మదనపల్లె : స్వచ్ఛత హి సేవ ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమీల

మదనపల్లె : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల అన్నారు. స్వచ్ఛతా హి సేవా–2024 కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సచివాలయ, మున్సిపల్ సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూచనల మేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2017 నుంచి స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది స్వభావ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత పేరుతో 14రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ 150వ జయంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేస్తామని చెప్పారు. గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంచుకోవడమే స్వచ్ఛతా హి సేవ ముఖ్య ఉద్దేశమన్నారు. పర్యావరణం కలుషితం కాకుండా ఉండాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. వన సంరక్షణ–మన సంరక్షణగా భావించి పట్టణంలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రావణి, ఏఈ స్నేహప్రియ, ఆర్వో నాగేశ్వరరావు, టీపీఓ జగదీష్, టౌన్ సర్వేయర్ పూర్ణచంద్ర పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం

కురబలకోట: స్వచ్ఛతతోనే ఆరోగ్యం సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి అన్నారు. గురువారం అంగళ్లులో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ సభలో ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దూరం అవుతాయన్నారు. పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీ సీఈఓ జీవీ రమణారెడ్డి, డీపీఓ నాగరాజు, ఎంపీడీఓ హరినారాయణ, గ్రామ కార్యదర్శి శేషగిరికుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవ పనుల పరిశీలన

రామసముద్రం: మండలంలోని చొక్కాండ్లపల్లి పంచాయతీలో గురువారం స్వచ్ఛతా హి హిసేవ పనులను మండల పరిపాలన అధికారి రమణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జరుగుతున్న కార్యక్రమలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దరిచేరవని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి జి.రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కురబలకోట: అంగళ్లు సభలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ ధనలక్ష్మి



రామసముద్రం: చొక్కాండ్లపల్లిలో స్వచ్ఛతా పనులను పరిశీలిస్తున్న అధికారి రమణ

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

మదనపల్లె : పీలేరు నియోజకవర్గం కే.వి.పల్లె మండలంలోని ఝరికోన ప్రాజెక్ట్ వాటర్ సప్లై కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కార్మికులు, ప్రజలకు నీటిసరఫరా చేశారని తెలిపారు. కార్మికులకు జీతాలు, ఉద్యోగభద్రత కల్పించక పోవడం సిగ్గుచేటన్నారు. 11 నెలలుగా వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు గుర్తింపుకార్డులు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో విచారణ



విచారిస్తున్న దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ బాల అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ విచారణ చేశారు. ఆలయంలో పూజారి కార్తీక్ దీక్షిత్ పాలన వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆలయంలో మాజీ కమిటీ సభ్యులు, అర్చకులను విచారించారు. అందరితో మాట్లాడి వారి వివరాలను సేకరించి అధికారులకు నివేదికలను పంపనున్నట్లు ఏసీ విశ్వనాథ్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలపై నిరసన


రాయచోటి (జగదాంబసెంటర్) : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బీజేపీ, దాని మిత్రపక్షాల నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై గురువారం రాయచోటిలో కాంగ్రెస్ నేతలు నిరసన ప్రదర్శన చేశారు. మొదటగా కలెక్టరేట్ వద్ద ఉన్న గాంధీబొమ్మకు పూలమాల వేసిన అనంతరం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు అమీర్‌బాషా, కె.శాంతయ్య, గోశాలదేవి మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై బీజేపీ మిత్రపక్షమైన శివసేన పార్టీ షిండే వర్గానికి చెందిన నేతలు దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. వ్యాఖ్యలు చేసిన నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సీపీఐ జిల్లానేత విశ్వనాథనాయక్ సంఘీభావం ప్రకటించారు. అనంతరం జిల్లా ఎస్పీని కలుసుకుని ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నేతలు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఆదుకున్న సోమశిల వెనుకజలాలు

పెనగలూరు : వినాయక ఉత్సవాలలో భాగంగా నిమజ్జనానికి సోమశిల బ్యాక్ వాటర్ ఆదుకుంది. పెనగలూరు మండలంలో ఒక చెరువులోనూ చుక్క నీరు లేకపోవడంతో నిమజ్జనానికి ప్రజలు బాగా ఇబ్బందులు పడ్డారు. సోమశిల బ్యాక్ వాటర్ బాగా ఆదుకుందని మండలంలోని గ్రామాల ప్రజలు అనుకుంటున్నారు. ఎస్ఆర్ పురం గ్రామం వద్ద సోమశిల బ్యాక్ వాటర్ ఉండటంతో పోలీసులు అక్కడే నిమజ్జన కార్యక్రమాలను ఏర్పాట్లు చేశారు. మండలానికి చివరిలో ఉన్న ఎస్ఆర్ పురం వద్దకు నలుమూలల నుంచి దాదాపు 30 కిలోమీటర్ల దూరం నుంచి విగ్రహాలు తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. కాగా సోమశిల వెనుకజలాలు లేకుంటే రాజంపేట మండలంలోని అత్తిరాల లేదంటే చిట్వేలి మండలంలోని చెరువులలో నిమజ్జనానికి విగ్రహాలను తరలించాల్సి వచ్చేది.

బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లె : బ్యాంకుల నుండి అందించే ఆర్థిక పథకాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని లీడ్ జిల్లా మేనేజర్ అంజనేయులు తెలిపారు. గురువారం మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీలో గ్రామ సమైక్య సభ్యులకు షికారిపాలెం గ్రామంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం బ్యాంకులు ద్వారా అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు పొందాలన్నారు. అందులో భాగంగా ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకం, జీవనజ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి, స్వల్ప వడ్డీ రుణాలు వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

వాల్మీకిపురం: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందని స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సావిత్రి అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో అండర్ 14, అండర్ 17 బాలబాలికల అథ్లెటిక్స్ మండల స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 120 మంది క్రీడాకారులు పాల్గొనగా, 100 మీటర్ల బాలురు పరుగుపందెంలో పీవీసీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి గిరిధర్, బాలికల విభాగంలో వైశాలి మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు ఉషారాణి, ఉమాదేవి, లలిత కుమారి, ధనలక్ష్మి, సబిత, రెడ్డివరప్రసాద్, రోషన్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ స్వరూప

పీలేరురూరల్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పి. స్వరూప, స్వర్ణ అన్నారు. గురువారం మండలంలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు సరైన ఆహారం తీసుకోకపోతే శారీరక, మానసిక ఎదుగుదల ఉండదని, ప్రతి రోజు ఆహారంలో చిరుధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. చదువుతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కరుణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు



పెద్దతిప్పసముద్రంలో క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగిన క్రీడా పోటీలను అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. ఎంపీడీఓ కేఎస్ బాలాజీ, ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్, పీడీ జవహర్, చైర్మన్ నరసింహులు,హెచ్ఎం అపర్ణాదేవి క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో పాల్గొనేలా చేస్తామన్నారు.

సంతాపం



అలివేలమ్మ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: మండలంలో టి.రాచపల్లె పంచాయతీ ఎగువబురుజుపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరామిరెడ్డి గారి శ్రీనివాసులు రెడ్డి తల్లి అలివేలమ్మ (80) మృతి పట్ల పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. గత కొంతకాలం ఆమె అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎగువబురుజుపల్లెకు వెళ్లి అలివేలమ్మ మృతదేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీ రమణ, సర్పంచ్ ఎల్లారెడ్డి, నాయకులు సత్యపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మల్లెల గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ కేఎస్ బాలాజీ పలు గ్రామాల్లో జరిగే ఈ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వచ్చే నెల ఒకటో తేదీ వరకు పకడ్బందీగా చేపట్టాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రధానంగా ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని ప్రజలకు క్షుణంగా వివరించాలని సూచించారు.